

కోల్‌సిటీ : బతుకమ్మ ఆడుతున్న మహిళలు



కోల్‌సిటీ : గోదావరిఖనిలో బతుకమ్మ సంబురాల్లో ఎమ్మెల్యే కోరుకంటి చందర్

# వాడ వాడంతా... పూల వనమాయే !

- 'ఖని'లో ఘనంగా సద్దుల బతుకమ్మ వేడుకలు • ఆడి..పాడిన ఆడబిడ్డలు...
- బతుకమ్మ పాటలతో మార్మోగిన కార్మిక క్షేత్రం • గోదారమ్మ చెంతకు చేరిన గౌరమ్మ..



పాలకుర్తి : పుట్నూర్‌లో సద్దుల బతుకమ్మ ఆడుతున్న మహిళలు



జ్యోతినగర్ : ఎన్టీపీసీ టౌన్‌షిప్‌లో బతుకమ్మ ఆడుతున్న మహిళలు




పాలకుర్తి : పుట్నూర్‌కు చెందిన పడాలసునీత పేర్చిన భారీ బీఆర్ఎస్ బతుకమ్మ



జ్యోతినగర్ : బతుకమ్మలతో చిన్నారులు



కోల్‌సిటీ : బహుమతులు అందజేస్తున్న లయన్స్ క్లబ్ అధ్యక్షురాలు తానిపర్తి విజయలక్ష్మి



గోదావరిఖని : నెత్తిన బతుకమ్మలతో ఆర్జీ-1 జీఎం శ్రీనివాస్, సేవా అధ్యక్షురాలు

కోల్‌సిటీ, అక్టోబర్ 22: తెలంగాణ సంస్కృతీ, సంప్రదాయాలకు పట్టుకొమ్మగా... పూల పండుగగా పిలిచే బతుకమ్మ పండుగలో చివరి ఘట్టమైన సద్దుల బతుకమ్మ వేడుక ఆదివారం గోదావరిఖని కార్మిక క్షేత్రంలో ఘనంగా జరిగింది. బతుకమ్మలతో వాడలన్నీ పూల వనాలుగా మారాయి. ఉదయం నుంచే తీరొక్క పూలు సేకరించి ఇంటికి వచ్చిన ఆడబిడ్డలు శ్రద్ధగా, ఎంతో అందంగా తొమ్మిది దొంతరలుగా బతుకమ్మలను పేర్చారు. గౌరమ్మను పూజించిన అనంతరం బతుకమ్మలను సమీప కూడళ్లకు వచ్చారు. అంతా ఒక చోట చేరి మహిళలు, యువతులు, చిన్నారులు తారతమ్యం లేకుండా బతుకమ్మల చుట్టూ తిరుగుతూ ఆటపాటలతో హోరెత్తించారు. వాడవాడనా బతుకమ్మల సందడి వాతావరణం కొనసాగింది. నడిజాము వరకు ఆడిన ఆడపడుచులు అనంతరం బతుకమ్మలను తీసుకొని సమీపంలోని గోదావరి నదికి తీసుకవెళ్లి నిమజ్జనం చేశారు. ఆపై గౌరమ్మకు నైవేద్యంగా పెట్టిన ప్రసాదాన్ని (సద్దులు) మహిళలు వాయినంగా ఇచ్చిపుచ్చుకొని ఆనందంగా వెనుదిరిగడంతో బతుకమ్మ వేడుకలు ముగిసిపోయాయి.

**దుర్గానగర్‌లో అలరించిన వేడుకలు**

గోదావరిఖనిలోని దుర్గానగర్‌లో సద్దుల బతుకమ్మ వేడుకలు అలరించాయి. లే ఔట్ కాలనీ కమిటీ ఆధ్వర్యంలో దుర్గానగర్ పార్కు ఎదుట మహిళలు బతుకమ్మ ఆడుకోవడానికి పచ్చటి కార్పెట్లు, పగటి కాంతిని తలపించేలా ఫ్లడ్ లైట్లు, మిళుకుమిళుకు అంటూ కాంతులీనే సిరీస్ బల్బులు, స్వాగత తోరణాలతో అందంగా తీర్చిదిద్దారు.. అతిథులు వీక్షించడానికి ఎల్ఈడీ తెర ఏర్పాటు చేశారు. కమిటీ చేసిన ఈ ఏర్పాట్లతో దుర్గానగర్ మహిళలు కుటుంబ సభ్యులతో కలిసి వచ్చి పండుగను సంతోషంగా జరుపుకున్నారు. ప్రతి ఏటా రెండు అసోసియేషన్ల మధ్య వేర్వేరుగా పోటీగా జరుపుకునేవారు. ఈ యేడు అందరూ కలిసిపోయి ఒకే కమిటీగా జరుపుకోవడం విశేషం. అందంగా బతుకమ్మలను పేర్చిన మహిళలకు బహుమతులు అందజేశారు. ఈ వేడుకల్లో కమిటీ అధ్యక్షులు బుచ్చిరెడ్డి, ప్రధాన కార్యదర్శి కంది రవీందర్ తదితరులున్నారు.

## సింగరేణి ఆధ్వర్యంలో...

గోదావరిఖని, అక్టోబర్ 22: సింగరేణి ఆర్జీ-1 ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక జీఎం కాలనీ స్టేడియంలో సద్దుల బతుకమ్మ వేడుకలు నిర్వహించారు. మహిళలు ఉత్సాహంగా పాల్గొని బతుకమ్మలను ఆడారు.

**ఘనంగా ఫ్యామిలీ డే సద్దుల బతుకమ్మ**

ఆర్జీ-1 జీఎం కాలనీ గోదావరి కళా ప్రాంగణంలో ఫ్యామిలీ డే సద్దుల బతుకమ్మ సంబురాలు వైభవంగా జరిగాయి. ఆర్జీ-1 జీఎం చింతల శ్రీనివాస్, సేవా అధ్యక్షురాలు చింతల లక్ష్మి శ్రీనివాస్ హాజరై బతుకమ్మ వేడుకలను ప్రారంభించారు.

**ఎన్టీపీసీలో ..**

జ్యోతినగర్, అక్టోబర్ 22: సద్దుల బతుకమ్మ వేడుకలు రామగుండం, ఎన్టీపీసీ పట్టణాల్లో ఘనంగా జరిగాయి. ఎన్టీపీసీ టౌన్‌షిప్‌తో పాటు టీటీఎస్, భీమునిపట్నం చిలుకలయ్యగుడి, అన్నపూర్ణకాలనీ ఏరియాల్లో మహిళలు సద్దుల బతుకమ్మను ఘనంగా నిర్వహించుకున్నారు. ఎన్టీపీసీ జ్యోతిక రిక్రియేషన్ క్లబ్ ఆధ్వర్యంలో టౌన్‌షిప్‌లోని ప్రధాన షాపింగ్ కాంప్లెక్స్ జరిగిన సద్దుల బతుకమ్మ సంబురాలు అంబరాన్నంటాయి. ఎన్టీపీసీ సీజీఎం కేధార్ రంజన్‌పాండు, జీఎం ఏకే దేశాయ్, జ్యోతిక రిక్రియేషన్ క్లబ్ అధ్యక్షుడు సింగరాయ్, కార్యదర్శి రాజనర్సు, తదితరులు పాల్గొన్నారు. రామగుండం పట్టణంలోని రైల్వే స్టేషన్ ఏరియా, అంబేద్కర్ చౌరస్తా, అక్బర్‌నగర్, ఇతర ఏరియాలో బతుకమ్మ వేడుకలు జరిగాయి.

పాలకుర్తి, అక్టోబర్22: పాలకుర్తి మండలంలోని సద్దుల బతుకమ్మ వేడుకలు ఘనంగా జరిగాయి. బసంత్‌నగర్ కేశోరాం సిమెంటు కర్మాగారం కార్మికులతోపాటు, సమీపగ్రామాల్లోని మహిళలు బతుకమ్మ వేడుకలను ఘనంగా నిర్వహించుకున్నారు.



ఫర్టిలైజర్‌సిటీ : గౌతమీనగర్‌లో సద్దుల బతుకమ్మ వేడుకలు